మనసు నిరుత్సాహంతో కదలలేనట్లు ముడుచుకుపోయిందీ సాయంత్రం. నమ్మించి మోసం చేశాడు శేఖర్. మనుషుల చుట్టూ ఈ డబ్బు రంగు రంగుల వల అల్లి బంధించి వేస్తోంది. శేఖర్ కూడా డబ్బుకి బానిసగా అమ్ముడైపోయాడు.

ఎంత అందంగా మోసగించాడో! నా ఊహలు తనచుట్టూ పూల తెరలై జారి పడుతున్నా యన్నాడు. 'శారదా! నీ అందం చూసిన నాకు మరో జన్మ కావాలనిపిస్తోంది' అన్నాడు.

ఇంకా ఎన్నెన్నో అన్నాడు. మంత్రించి వేశాడు ఇన్నాళ్ళూ. పెళ్ళి పేరు వినగానే మళ్ళీ ముఖం చూపించలేదు నిన్నటి మంచి!

పెళ్ళికీ, ప్రేమకీ చాలా దూరం ఉంది ఈ నాటి మనుష్యుల దృష్టిలో. అందుకనే ఆడదాన్ని ప్రేమించవచ్చు. రహస్యంగా కలుసుకోవచ్చు. ఆశల పూల పల్లకి ఎక్కించి, తనివితీరా విహరించి హఠాత్తుగా క్రిందకు త్రోసివేయవచ్చు.

ఇదంతా కొందరి స్వార్ధపరుల వేట. ఆడదాన్ని అబలగా చేసి ఆడుకునే ఆట. ఆ పైన కళంకం కూడా ఆడవారికే. నీతీ నిజాయితీ, మానం మర్యాదా మనుష్య లందరికీ కావాలని తెలియని శేఖర్ వంటి మూర్ఖు లున్నంతకాలం ఈ సంఘంలో విషాద గాధలు వినిపిస్తూనే ఉంటాయి.

ఈ మనస్సు నెలా ఓదార్చను? ఈ గుండె లింతగా కుమిలిపోతున్నాయని ఎవరికి విప్పి చెప్పుకోను? ఎవరో నన్ను ప్రేమించి, పెళ్ళిమాట ఎత్తగానే మరిచి పోయారని ఎలా చెప్పను అమ్మతో?

పది రోజుల్లో శేఖర్‌కి పెళ్ళి. ఈ లోపల నా పెళ్ళి జరిగితే? ఆ మూర్ఖుడికీ తెలిసివస్తుంది — నా మనస్సూ శిలగానే మారిపోయిందని, నేనూ తనని మరిచి బ్రతకగలనని. కాని ... కాని, ఎవరు తెలిసి తెలిసి ఈ నిప్పుని కావిలించు కుంటారు?

"శారదా! ఇదేమిటి, ఇలా చీకట్లో కూర్చున్నావే?"

"ఎవరూ? బావా, నువ్వా? కూర్చో. రా."

నా ఆలోచనలు మళ్ళీ విశ్వం బావ వైపు మళ్ళింది. బహుశా బావకు్కూడా తెలిసే ఉండవచ్చు నా సంగతి.

"అంతా విన్నాను, శారదా. ప్చ్! ఏమిటో! ఇలా జరుగుతుందని ..."

"ముందే అనుకున్నావా, బావా?"

"అనుకోవడమే గాదు! నీతో చెబితే అపార్థం చేసుకుంటావని శేఖర్‌తో అన్నాను."

"ఏమన్నాడు?"

"నవ్వాడు. 'ఆమాత్రం నాకు తెలియదా? శారదని కాదని నేను బ్రతగ్గలనా?' అన్నాడు."

"బహుశా ఇప్పుడు బ్రతికి లేడేమో అయితే?"

"ఊహూఁ! బ్రతికే ఉన్నాడు. అర లక్ష కట్నం కోసం!" అన్నాడు బావ.

"నేను చేసింది తప్పుకాదని తెలుసు. నా మనస్సుకి నచ్చిన మనిషిని ప్రేమించడం తప్పా, బావా? అతడూ నాకోసం ఏవేవో గాలి మేడలు కడతానన్నాడుగా? అవి గాలి మేడలని అప్పు డెలా తెలుసు నాకు?! ఇంటరునుంచి ఎమ్. ఎ. వరకు కలిసి చదువుకున్నాం. కట్నాలూ, కానుకలూ వద్దని ఉపన్యాసాల్లో చెప్పి ఎన్నో బహుమతులు గెలుచుకున్నాం. మాకు మేడ లేదు. కారు లేదు. నాలు గంకెల జీతం లేదు. మామూలు గుమాస్తా మా నాన్న అని తనకు తెలియదూ? పోనీ, నే నేమైనా ఆడంబరంగా, అందాల సీతాకోక చిలకలా అలంకరించుకుంటానా? లేనిపోని వేషాలు వేసుకుని మోసం చేశానా?"

"నీ బాధ నాకు తెలుసు, శారదా! వాళ్ళు ఉన్నవాళ్ళు. ప్రేమనీ, పెళ్ళినీ డబ్బుతో ముడివేసి సంతోషాన్ని కొనుక్కుందా మనుకున్న వాళ్ళు. శారదా! ఒక్క మాట అడగనా?"

"అడుగు, బావా! ఆగిపోయావేం? పోనీ, నీ సందేహాన్ని నేనే విప్పుతాన్లే. 'ఉత్త ప్రేమేనా, లేక ఇంకా పైపైకి పోయారా?' అని కదూ నీ సందేహం? ఇంకా వినోదం ఎలా చూడగలను, చెప్పు! ఏటి నీటికి కట్ట తెంపి ఎంద రెలుగెత్తి అరిచినా మునిగిపోవడమే తప్ప, తేలడం లేదు. అలా ఉంది నా బ్రతుకిప్పుడు!"

"అయితే ... నువ్వు ..."

"అవును, బావా, అమ్మని కాబోతున్నాను ఒకరి భార్యను కాకముందే! ఇంకా గడువు ఆరు నెలలే."

బావ ఊహించి ఉండ డీ పరిణామాన్ని. అందుకే నిర్ఘాంతపోయాడు. 'పాపం! ఎంతోసేపు ఇద్దరం అలాగే కూర్చుండి పోయాం. ఏమని 'ఓదార్చాలో' బావకు తెలియడం లేదేమో? ఏ విధంగా ఈ బ్రతుకు ముగుస్తుందో నాకు తెలియడం లేదు.

"శారదా! ఒక్క మాట చెప్పనా? నన్ను ... నన్ను ప్రేమించలేవు, కానీ ... భర్తగా నీ పక్క నిలబడి ఈ లోకాని కింకా మానవత్వం చావలేదని చెప్పనిస్తావా?"

"ఇంకా నన్ను ప్రేమిస్తున్నావా బావా! నీ గుండెల్లో నాకు చోటుందని ఏనాడో గ్రహించాను. కానీ, నీ మనస్సంత అందమైనదని, నీ ప్రేమలో మోసం లేదని నాకు తెలియదు. కొన్ని సార్లు గడ్డిపూలు కూడా గులాబీల్లాగా మెరిసి భ్రమింపజేస్తాయి. కొన్ని పూలు అందాన్ని లోలోన దాచుకుని, విశాలంగా రంగా చేరుస్తై పరిమళాలు జల్లుతాయి సంపెంగల మాదిరిగా! ఈ మనుషులు కూడా అంతే! ... కానీ, నేనూ గడ్డిపువ్వునే, బావా! నిన్ను ప్రేమించగలనని చెప్పలేను. బహుశా ప్రేమించలేనేమో? ఎందుకంటావా? ఈ గుండెల్లో ఇక ఆ ప్రేమ తొలిచూపు నీడ లేదు. ఎడారిలా ఎండిపోయిన నా ఊహలు జీవితం మీద ఆసక్తిని కోల్పోయాయి."

"నీ చుట్టూ నువ్వు ఊహించినంత చీకటి లేదు, శారదా! నీ జీవితం నిండుగా వెలుగు గుమ్మరించుతానని చెప్పలేను. కాని, నిన్ను చూసి నలుగురూ నవ్వకుండా మాత్రం భరించగలనని మాత్రం చెప్పగలను. నా జీతం మూడు వందలు. అదే ఆధారం మన కిక. నీ అంత చదువు లేదు అని నేను బాధపడను. నా కున్న దేదో నాదీ, నీదీ. నీ కున్నదంతా మన శిల్పరిటీ. నీతో పెళ్ళికి పెద్ద త్యాగమని పేరు పెట్టలేను. ఒక విధంగా నా ఆశలు ఫలించాయి. అంతే. నిన్ను ప్రేమించాను. కానీ, నువ్వు అందంలో, చదువులో నన్ను మించిపోయావు. అందుకే నా గుండెలోనే దాచుకున్నాను నా ప్రేమ నిన్నాళ్ళూ!"

"ఇప్పు డిలాగే ఉంటుంది, బావా! కాని, నాకు బాబో, పాపో పుట్టిన తరవాత నీ గుండెలో అంత ప్రేమా అగ్నిలా మండిపోతుంది. అది మరింత నరకం. వద్దు. ఇలాగే చావనీ" అన్నాను.

"ప్లీజ్! అలా నిరాశని పెంచుకోకు, శారదా! నా మాట కాదనకు. అత్త


## దీపావళి ప్రత్యేక సంచిక

**పేజీలు 120 5—11—75 వెల: రు. 1-50**

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవంబర్ 5వ తేది సంచిక దీపావళి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది

దీపావళి కథల పోటీలో బహుమతులందుకున్న కథలన్నీ ఇందులో ప్రచురితం కావడం విశేషం.

అనేక వర్ణ చిత్రాలు, సచిత్ర వ్యాసాలు, ఇతర కథలతోపాటు మామూలు శీర్షికలన్నింటితో అత్యంతాకర్షకంగా వెలువడుతుంది.

# మిగిలిందేమిటి!



-యలమంచిలి భూపాలక్ష్మి

య్యతో చెబుతాను ఈ రాత్రే. విశాఖ పట్టణం వెళ్ళిపోదాం రేపే అందరం కలిసి. పది రోజుల్లోపలే పెళ్ళి ఏర్పాటు చేయించుతాను. అక్కడ మా స్నేహితు లున్నారు. తప్పకుండా సాయం చేస్తారు... ఏం? మరి వ్రాయనా, ఏర్పాట్లన్నీ చేయమని?'' అని అడిగాడు బావ చేయి జాచి.

నా మన స్పేడుస్తూంది లోన! కళ్ళలో నిలబడి కూడా దుఃఖాన్ని నిగ్రహించు కుంది నా మనస్సు!

ప్రేమ పేరుతో కట్టుకున్న స్వప్న సౌధాలన్నింటినీ కూల్రదోసి, నిరాశకి నిప్పంటించి మసి జేసి కొత్త ఆశల వైపు చూడగలనన్న ధైర్యంతో బావ చేతిలో చేయి వేశాను.

విశాఖపట్టణంలో జీవితం మొదలైంది. పెళ్ళి చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. వాలో అది ఏ మధు రానుభూతుల్నీ కలిగించలేదు. నా అందం ఇంకా బావని వెర్రెత్తిస్తూనే ఉంది. కొత్తచీర కట్టుకున్నా, తలలో పూలు తురుముకున్నా తన కళ్ళలో నా పైన కోరిక కదులుతూంది. నా చేతి స్పర్శ కోసం తహతహలాడిపోతున్నాడు. చేరువగా రావాలని తపించిపోతున్నాడని స్పష్టంగా అతని ప్రతి మాటలో తెలిసిపోతూంది.

కానీ, నా కదంతా పిచ్చితనం అనిపిస్తూంది. శేఖర్ కూడా ఇలాగే నన్ను మహారాణిలా ఆరాధించాడు కొన్నాళ్ళు. క్షణక్షణానికీ కొత్త కొత్త ఊహలతో పులకించిపోయే దప్పుడు నా మనస్సు. అంత ఆనందమూ ఈ నాడు నాకు కలగా కనిపిస్తూంది.

బావ ప్రేమ చూస్తూంటే జాలి వేస్తూంది. తనకోసం నా మనసున మళ్ళీ వసంతం నింపగలిగితే? ప్చ్! కానీ, ఆ పని నా కిక సాధ్యం గావడం లేదు. ఎవర్నీ ప్రేమించా లనిపించడం లేదు. కానీ, బావ నన్ను శారీరకంగా గెలుచుకున్నాడు కొన్నాళ్ళ తరవాత. మనస్సు ఎప్పుడో బండరాయిగా మారిపోయిందేమో? నవ్వమా లేదు ఈ కొత్త బంధానికి! ఏడ్వమూ లేదు.

నెలలు నిండాయి. మరో ఊరు పంపించాడు నన్ను బావ పురిటికోసమని, అమ్మతో చెప్పి. తన స్నేహితుడి ఇంటి దగ్గరే పుట్టాడు బాబు. వాడిని చూడ గానే నా గుండెల్లో కొత్త ఆశలు పూశాయి. వాడి బుల్లి బుల్లి చేతులు తగలగానే నా నిరాశ పారిపోయింది. మళ్ళీ ఉత్సాహం, పట్టుదలా నాలో పోటీ పడ సాగాయి. అచ్చు శేఖరంలా ఉన్న బాబుని చూసి బావ గుండెలో ఈర్ష్య చెలరేగు తుం దేమో ననుకున్నాను. పది రోజుల్లో మళ్ళీ విశాఖ చేరుకున్నాం.

బావకి నా పైన ధ్యానం. నా ప్రాణం బాబు పైన! రైలు దిగీ దిగక ముందే నా చెవిలో గుసగుస లాడాడు. 'శారూ! ఎర్రగా పండిన నీ పెదాలు చూస్తూంటే నాకు మతి పోతూంది. రోజు రోజుకీ నీ అందం మరింత వెలిగిపోతూందేమిటి?' అంటూ.

బాబుని చూడగానే ఆ కళ్ళలో నిషా కొంతవరకు దిగిపోయింది. క్షణంసేపు బొమ్మలా నిలబడిపోయాడు. అతని గుండెలో ఈర్ష్య మొదలైం దనిపించిం దా కళ్ళు చూస్తూంటే.

ఎన్నాళ్ళు గడిచినా బాబుకి పేరే పెట్టలేకపోయాను. వాడికి కొత్త చొక్కాలు తీసుకురమ్మంటే వినిపించ నట్టు వెళ్ళిపోతున్నాడు బావ. ఎక్కడా లేని కరువు అక్కడే వచ్చి పడినట్లు 'డబ్బు లేవి?' అన్నాడో రోజున నిలదీసి అడిగితే.

పచ్చగా, బొద్దుగా ఉన్న బాబుని చూస్తూంటే బావ కెందుకు మనసు కరగడం లేదో నా కర్థంకావడం లేదు. నా కున్నదంతా తనదే నన్నాడు. మరి బాబు నా వాడు కాదా? నన్ను స్వీకరించగల మనిషి వాణ్ణి కాదంటే నే నేమైపోతా ననుకుంటున్నాడో?

ఎప్పటికో వాడి పేరు 'రాజా'గా స్థిరపడిపోయింది. వాడికోసం పక్క వాటాల్లోని పిల్లలకి ట్యూషన్లు చెప్పడం మొదలెట్టాను. ఏడాది తిరిగి పోయింది. ఏనాడూ రాజాని ఎత్తుకుని ఎరగని బావ ఆ నాడు చాకొలెట్లు తెచ్చి ఇచ్చి మరీ ఎత్తుకున్నాడు.

''ఏమైం దీ వేళ! ప్రమోషనేమైనా వచ్చిందా?''

''ఒక రకంగా అలాంటిదే. మిలిటరీలోకి వెళ్ళిపోతున్నాను, శారదా!'' అన్నాడు.

''నానుంచి పారిపోవడం లేదుగదా? బహుశా రాజా నీ కంటికి రాక్షసుడులా కనిపిస్తున్నా డనుకుంటున్నాను!''

''ప్లీజ్! ఇక ఆ ప్రసక్తి రానివ్వకు, శారదా! వాడిష్టన్లు నే నిన్నాళ్ళూ రాక్షసుడిలా ప్రవర్తించానని మళ్ళీ గుర్తు చేయకు. నా మనస్సు నలిగిపోతూంది. ఓ వైపున నలుగురూ నవ్వుతున్నారు నన్ను చూసి. నేను పిరికివాణ్ణట. పౌరుషం లేని వాడినట. ఎవడి కొడుకునో నా వాడుగా పెంచుతూ, నీఅందానికి బానిసనై పోయానట. మరో వైపు నుంచి నన్ను చూసి నా మనస్సే నవ్వుతూంది, నీ రక్తం పంచుకుని పుట్టిన వాడిని నే నెందుకు ప్రేమించలేక పోతున్నానా అని? నీ అందం నాది, నీ సుఖదుఃఖాలు నావి అయినప్పుడు రాజా ఎందుకు నాకు దూరంగా ఉండాలి! ప్లీజ్, శారదా, వ న్నపార్థం చేసుకోవద్దు. ఈ మనుషులు మారుతూన్న వాళ్ళపైన రాళ్ళు రువ్వడం మానరు. ఒక మంచిపనికి ఎన్నో ఆటంకా లుంటాయి వీళ్ళతో ఉంటే.''


''నే నప్పుడే అన్నానుగా, బావా, ఇది మరో పెద్ద నరకం అవుతుందని? పోనీలే. వెళ్ళు. వెళ్ళి నువ్వయినా సుఖంగా ఉండు!''

''ఒక్క మాట, శారూ! నిన్ను కాదని, నీకు దూరంగా ఉండి నే నెలా సుఖ పడతానంటావు? కానీ, వెళ్ళాలి. వెళ్ళి తీరాలి. మరో సంగతి— నే నిక్కడున్నా నీకు ఒంటరితనమే. ఆ శేఖర్ని నువ్వు మరిచిపోలే దింకా. బహుశా మరిచిపోలే వేమో? నీ మనస్సున ఇన్నాళ్ళయినా నీ వాడుగా నిలబడలేనప్పు డెక్కడుంటే ఏ ముంది, శారదా?''

బావ మాటల్లో నిజం నన్ను కాల్చి వేస్తూంది. కాని, అది నిజం. దాన్ని కాదని ఏం చెప్పినా నమ్మించలేను. అతని బాధని పంచుకోలేక పోతున్నాను.

''నేను నీకు తగను, బావా! నీ దారిని నువ్వు వెళ్ళిపో. నీకు మనసివ్వగలిగిన అమ్మాయిని నీ జీవితంలోకి ఆహ్వానించు. నాకేదో చదువు ఉంది. రాజా కాస్త పెరిగాడు. ఉద్యోగం చూసుకుంటా నిక!''

''నే నంత మూర్ఖుణ్ణిగాదు, శారూ! నిన్ను కాదని మరొకర్ని ఆహ్వానించడానికి నాకిక హక్కు లేదు. ఈ మనస్సంతా నీ ఊహాలే. ఆ ఊహల నిండుగా నీ రూపమే. అది నా మాట విన దిక. నీ ఎదుటే ఉంటూ, నీ మనస్సు నాది కాదని తెలిసీ శారీరక సుఖంకోసం ని న్నెలా బాధ పెట్టను? నన్ను నే నెలా ఓదార్చుకో గలను? భార్యాభర్తల మధ్య కోరికే కాదు, శారూ, ప్రేమ, అభిమానం కూడా ఉండాలి. అవి లేవు మన మధ్య. అయినా, నిన్ను దూరం చేసుకోలేను. రాజా నా మూలాన ఏమీ లేనివాడు కావడం సహించలే నిక. నెల నెలా డబ్బు పంపించు తాను. నువ్వుకూడా ఉద్యోగంలో జాయి నవ్వు. వాడి భవిష్యత్తుకి ఆర్థిక బలం చాలా అవసరం. అప్పుడప్పుడు వస్తుం టాను! ఈ లోపల నీ మనస్సు మారితే ఎక్కడో ఒకచోట స్థిరపడదాం; లేదా ఇలాగే జరిగిపోనివ్వు'' అన్నాడు.



బావ నిజంగా ఇప్పుడు చేస్తున్నాడని పించింది గొప్ప త్యాగం. రాజాకోసం డబ్బు కూడబెట్టాలన్న భావం ఉండబట్టే ఇలా అంటున్నాడేమో? బావ లాంటి వాళ్ళు జీవితాలు త్యాగం చేస్తే తప్ప నా లాంటివాళ్ళ బ్రతుకులు చక్కబడవా? ఇంతటి సహృదయులు ఎందరుంటారు?

పది రోజుల్లో వెళ్ళిపోయాడు. వెళ్ళేనాడు నాకు దుఃఖం ఆగలేదు. ఎవరో ఆత్మీయుణ్ణి చేతులారా దూరం చేసుకున్నట్లు నా గుండెలు తరుక్కుపోయాయి దుఃఖంతో. కానీ, ఎలా ఆపను అతనిని? ప్రేమించిన వాళ్ళే శాసించగలరు. నాకా హక్కు లేదు బావపైన.

"శారదా! ఈ మనస్సుకి ప్రేమ అన్నదే తెలియకుండా ఉంటే ఎంతో బాగుండేది. ప్రేమ వల్ల సుఖం లేదని తెలిసే ప్రేమిస్తుంది. మనిషికీ, మనిషికీ మధ్య బంధాలు పెంచి, వాటిని తెంచుకోలేక గిలగిలలాడుతూంటే అది ఏడుస్తుంది; మనల్ని ఏడిపిస్తుంది. నాకు నువ్వు కావాలి. నీకు రాజా కావాలి. నీ మనస్సుకి శేఖర్ రారాజా. ఎలా ఉంది ఈ గొలుసు? ప్చ్! పోనివ్వు. ఏదో జరిగిపోయింది. ఇకనుంచి మన లక్ష్యం రాజా భవిష్యత్తు. అంతే. వాడికోసం శ్రమపడాలి. లేకుంటే ఈ లోకం వాణ్ణి పిచ్చికుక్కలా మార్చి తరిమివేస్తుంది! నేనే వాడికి తండ్రినని చెప్పు. శేఖరం గురించి ఏమాత్రం తెలియనివ్వకు. రాజమండ్రిలో నా స్నేహితుడికి వ్రాశాను, నీ కేదైనా ఉద్యోగం చూడమని. ఉత్తరం రాగానే అక్కడికి వెళ్ళిపో. ఈ వాతావరణం నుంచి బయట పడితే కొత్త వాళ్ళకి మన కథ తెలియదు కనక రాజాని నా కొడుకుగానే పెంచవచ్చు. వస్తాను మరి ..."

నా నుదుట ముద్దు పెట్టుకుంటూంటే అతని కళ్ళ నిండా నీళ్ళే. ఒక్కసారి గాఢంగా గుండెలకు అదుముకుని వదిలివేసి భారంగా వెళ్ళిపోయాడు బావ.

అప్పటికే చుట్టుపక్కల వాళ్ళు గుసగుసలు మొదలెట్టారు. రాజమండ్రి నుంచి ఉత్తరం రాగానే బయలుదేరి వెళ్ళిపోయాను. బాంక్‌లో ఉద్యోగం. నెలకు మూడు వందలు. ఎమ్. ఎ. చదవడం చాలా మంచి దయింది. చదువు మన కాళ్ళమీద మనల్ని నిలబడనిస్తుంది. బావ నెల నెలా రెండు వందలు పంపిస్తున్నాడు. కొంత మిగిల్చి బాంకులో వేస్తున్నాం ఇద్దరం కూడా!

రెండేళ్ళు గడిచిపోయాయి. బావ ఒక్కసారి కూడా రాలేదు. నా కెందుకో బాధగా ఉంది. నామీద నాకే కష్టంగా ఉంది. ఎన్నోసార్లు రమ్మని వ్రాశాను. కాని, ఆ ప్రసక్తే రాకుండా వ్రాసేవాడు ఉత్తరాల్లో. నా కోసం ఇంత చేస్తున్న బావని నే నెలా సుఖపెట్టను? ఎందుకు ప్రేమించలేకపోతున్నానో నా కర్థం కావడం లే దెంతగా తల బద్దలు కొట్టుకున్నా.

అయిదారేళ్ళు దాటాయి. రాజా రెండవ తరగతిలోకి వచ్చాడు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతూంది. బావ దగ్గరి నుంచి వారం రోజులు దాటినా జాబు రాలేదు. ఎందుకో నాకు భయంగా ఉంది లోలోన. ఆఖరికి నెల దాటిన తరవాత యుద్ధం ముగిసిన తరవాత వచ్చింది. ఆనందంతో ఆత్రతగా విప్పాను జాబుని.


"శారదా!

ఈ యుద్ధంలో గెలిచాం. ఇన్నాళ్ళూ ను వ్వెన్నిసార్లు రమ్మని వ్రాసినా ఎందుకో రావాలనిపించలేదు. వస్తే మళ్ళీ నిన్ను వదిలి రాలేనన్న భయమనుకుంటాను నా గుండెలో! ఎంతో ధైర్యాన్ని కూడదీసుకుని నీ నుంచి రాగలిగాను. వచ్చిన తరవాత ఎన్నాళ్ళో నీ కోసం ఈ మనస్సు ఏడ్చింది. నన్ను పిచ్చివాడిలా చేసింది. కాని, ఎలాగో తట్టుకున్నాను. నీకు దూరంగా ఉండగల మనో నిగ్రహం వచ్చింది. కాని, మళ్ళీ దూరమై పోతుందేమో? ఇక్కడ ఉండలే నిక. పది, పదిహేను రోజుల్లో వచ్చేస్తున్నాను. నీ ఊహల్లో ఏ మూలైనా కదులుతున్నానేమో చూడాలని ఉంది. రాజాకి చెప్పు నాన్న బొమ్మలు, బిస్కత్తులు తీసుకువస్తున్నాడని. మరి వస్తాను.

ప్రేమతో...

నీ విశ్వం."

గుండెలో పేరుకుంటున్న బరువంతా కరిగిపోయినట్లయిం దా జాబు రాగానే. బావకోసం నా మనస్సు నిరీక్షించసాగింది. ఇంక మూడు రోజులే ఉన్నాయి.



సాయంత్రం వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తూంటే వచ్చా రెవరో గేటు తీసుకుని.

ఎవరా అని తల ఎత్తి చూశాను.

శేఖర్! ఆశ్చర్యం, భయం, అసహ్యం—ఇంకా ఎన్నెన్నో కలిసి నా పైన దాడి చేశా యా క్షణంలో. మనిషి మున పటిలా లేడు. చాలా చిక్కిపోయాడు. కారణం—నా మీద ప్రేమ కాదని మాత్రం తెలుసు. మరేమిటో అర్థతు బట్టలేదు. మాట్లాడా లనిపించలేదు.

"ఎలా వచ్చానని ఆశ్చర్యం గదూ, శారూ?"

"నా పేరు శారదా విశ్వం!" కటువుగా వినిపించింది నా గొంతు నాకే.

"సారీ! మరిచిపోలేదు. విశ్వమే వ్రాశాడు. మద్రాసు ఆఫీసు పనిమీద వెళితే వాళ్ళ ఆఫీసరుతో కనిపించాడు హోటల్లో. బాబు సంగతి చెప్పాడు. మీ మన స్సింకా నన్ను మరిచిపోలేదని బాధ పడ్డాడు!"

"నిన్ను మరిచిపోయిం దెప్పుడో! నీ వాటకాన్ని మరిచిపోలేక పోతూంది. అంతే. దాన్ని భ్రమ అనుకోవాలి. నా కసలు నిన్ను తలుచుకుంటేనే చావాలన్నంత అసహ్యం పుట్టుకొస్తూంది. రాజా నా కొడుకు. ఎవరికీ హక్కులేదు వాడిమీద!" కోపంతో వణికిపోయాను.


పెద్దగా నిట్టూర్చా డతను. రెండు, మూడు నిమిషా లాగి అన్నాడు:

"జరిగింది తెలిస్తే నువ్విలా కోపంతో మండిపడలేవు, శారదా! నిన్ను కాదని ఎవరినో పెళ్ళాడ్డం పెద్ద తప్పే. అందుకు కారణాలు చెప్పి నిన్ను విసిగించ నిప్పుడు. కాని, శిక్షమాత్రం పడిందని చెప్పక తప్పదు. మాకు పిల్లలు పుట్టలే దింతవరకు! అసలు పుట్టరని డాక్టరు చెప్పాడు. అంతేగాదు, నా భార్యకి పక్షవాతం వచ్చి సంవత్సరం దాటి పోయింది. అర లక్ష కట్నం తప్ప ఆవ గింజంత సుఖం కూడా లేదిప్పుడు ..."

"చాలా విచారించవలసిన విషయమే! ఎవరైనా మరో అర లక్ష ఇస్తారేమో చూడకపోయారా? ఈ దేశంలో ఆడ పిల్లల గొంతులు డబ్బు తీసుకుని కోయడం చాలా తేలికేగదా?"

"ప్లీజ్! చచ్చిన పాము నింకా చావ గొట్టకు, శారదా! నువ్వెన్ని తిట్టినా భరించగలను. కానీ, నన్నుమాత్రం అర్థం చేసుకో. బాబుతోబాటు మన ఇంటికి రా. విశ్వాన్ని అడిగాను. నీకు ఇష్టమైతే తన కడ్డేమీ లేదన్నాడు."

"ఆపు! వినలే నిక! ఇప్పుడా నీకు శారద కావాలి? బాబు గుర్తు కొచ్చింది



గాంభీర్యం ఫోటో—ఎస్. ఎన్. రావు (మద్రాసు—28)

ఎందుకో? వంశం నిలపడానికా? ఏ హక్కుతో నీ ఇంట్లో అడుగు పెట్టను? నీ భార్యకు విడాకు లిచ్చావా? లేదుగదూ! ఇవ్వలేవు కూడా! ఇస్తే డబ్బు పోతుంది. నీ ఉంపుడుగత్తెగా ఆహ్వానిస్తున్నా వన్న మాట. మిస్టర్ శేఖరం! నీతి, నియమా లతో బ్రతకడం గొప్ప వరం. అంతేగానీ, గాలి ఎటు వీస్తే అటు తిరగడం మనిషి కసలు లక్షణం గాదు. నాకోసం తన జీవితాన్నే త్యాగం చేసిన బావతో నువ్వసలు మాట్లాడతగవు. ఈ మాట చెప్పి మండుతూన్న ఆ గుండెల్లో ఆజ్యం పోశావు. నాకోసం ఎన్నేళ్ళకో రాబోతూన్న బావని మళ్ళీ దుఃఖంతో కుమిలిపోయేట్లు చేశావు. నీ నీడ పడినా భరించలే నిక. వెళ్ళు. ప్లీజ్! వెళ్ళిపో!" ఏడుస్తూ లోనికి పారి పోయాను బాబుని తీసుకుని.

"క్షమించు, శారదా! నీ మనస్సు నాదే నోనన్న భ్రమతో వచ్చాను. కాని, ఒక్క కోరిక. బాబుని ఒక్కసారి మా ఇంటికి తీసుకు వెళ్ళనివ్వు. నా భార్యకి చూపించి, వీడు మన వాడని చెప్పితే చాలు ఆ మనిషి కాస్త కోలుకుంటుంది. రేపు సాయంత్రం వస్తాను ... కాదనకు!" అని వెళ్ళి పోయాడు.

ఆ రాత్రి నాకు నిదురే లేదు. బావ కోసం కలలు కంటున్న నా మనస్సు మళ్ళీ శేఖరం రాకతో పగిలి ముక్కలైంది. ఏ ముఖం పెట్టుకుని బావని రమ్మని వ్రాయ నింకా? ఎందు కిలా రాజాకోసం తన జీవితాన సుఖం లేకుండా చేసు కోవడం? అంత ఉన్నతుడైన బావకి నేను తగను. అమృతం పంచి ఇచ్చిన అతనికి ప్రతిగా నే నేమివ్వగల నింకా?

ఆ రాత్రంతా ఆలోచించాను. ఒక నిశ్చయానికి వచ్చాను.

మరునాటి సాయంత్రం శేఖరం వచ్చాడు. రాజాని అతనితో పంపించాను. 'తీసుకురావడానికి ఎవరినైనా పంపి స్తాను, అంతవరకు పంపించవ'ద్దని చెప్పాను. అందు కత డాశ్చర్యపోయాడు. అయినా, నేనేమీ మాట్లాడలేదు.

బావ దగ్గరి నుంచి రావడం లేదని టెలిగ్రాం వచ్చింది. నా గుండె దుఃఖంతో పగిలిపోయింది. ఎంత నిగ్రహించుకున్నా బావను తలుచుకున్న కొద్దీ ఏడు పొస్తూంది. అతనికోసం నాలుగు వాక్యాలు వ్రాశాను. చదువుతూంటే నాకే దుఃఖ మాగలేదు. బావ ఎలా భరించగలడో ఇంత నిరాశ అనిపించింది.

నా మనస్సు ఆక్రోశించింది ఆవేదనలో.

"నిన్ను ప్రేమించాను, బావా! నిజం. నా మనస్సంతా నువ్వే ఇప్పుడు! నీకోసం వేయికళ్ళతో ఎదురు చూశాను. కాని, నువ్వు రాలే విక. రావద్దు. ఈ శారద నీ పాలిట రాక్షసి! నీ సుఖాన నిప్పులు పోశా నిన్నాళ్ళూ! ఓ మూర్ఖుణ్ణి పిచ్చిగా ప్రేమించి రత్నం లాంటి నిన్ను దూరం చేసుకున్నాను. నా కది శిక్ష—శేఖరాన్ని ప్రేమించినందుకు!

రాజాని శేఖరం గారికి శాశ్వతంగా ఇచ్చివేశానంటే నువ్వు బాధపడతావు. కానీ, నీ కెందుకా బాధ! నా కన్న కడుపు తరుక్కు పోతుంది. కానీ, న్యాయంగా వాడు అతని రక్తం. అతనికే మిగలాలి! ఆ భారమంతా అతనిది. నేను ...ఎక్కడో ఈ మహా విశ్వంలో రాజా లాంటి వాళ్ళ కోసం ఏ కొంచెమో సాయం చెయ్యాలని వెళ్ళిపోతున్నాను. రాజాని మరిచిపోలేని ఈ గుండె కక్కడే శాంతి. నీ కేమాత్రం శాంతి నివ్వలేని నా బ్రతు కిక అక్కడే విశ్రాంతి తీసుకుంటుంది.

బావా! శేఖర్‌కి చెప్పు — రాజాని ఎలా వదులుకోగలిగానో, ఇంత రంపపు కోత నెలా భరించి వెళ్ళిపోతున్నానో! వాడితో... రాజాతో చెప్పు ...అమ్మ మళ్ళీ ... రాదని ... పెరిగి పెద్దయి, బుద్ధిమంతుడై, మరో విశ్వంలానూ రేళ్ళు బ్రతకాలని!

రాజాని పంపించిన తరవాత నా దగ్గ రిక మిగిలిం దేమిటి, బావా? శూన్యం! ఈ శూన్యాన్ని మళ్ళీ నీ దగ్గరకు మోసు కుని రాలేను. నీ బ్రతుకు మళ్ళీ సుడి గాలిలా మారిపోతుంది. నాకోసం బాధ పడకు. ఈ క్షణంలో నా గుండెలో ఒక్కటే కోరిక, బావా!... కాదనకు ... నీకు తోడుగా మరొకర్ని ఆహ్వానించు నీ జీవితంలోకి. ఇంతే. వెళ్ళిపోతున్నాను, బావా! వెళ్ళిపోతున్నాను."

రైలుఎక్కబోతూ చదివిన ఉత్తరాన్ని మడిచి, పోస్టు చేయమని సాయంగా వచ్చిన పక్క ఇంటి పాప కిచ్చేశాను.

అయిపోయిం దిక. మిగిలిం దేమీ లే దీ బ్రతుకులో.

★